క్లుప్తంగా

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు



హోమంలో పాల్గొన్న భక్తులు

చందుర్తి: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని నక్కపల్లెలో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో హోమం కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంబిరి కల్పన నరేశ్ దంపతులతో పాటు ఆలయ చైర్మన్ గడ్డం రమేశ్, వైస్‌చైర్మన్ పిట్టల చిన్న రాజయ్య, మాజీ సర్పంచులు బానాల గంగారెడ్డి, కొమ్ము రమేశ్, వార్డు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంఘ భవనానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో ఎంపీ బండి సంజయ్‌కుమార్ మంజూరు చేసిన రూ.10 లక్షలతో చేపట్టిన రెడ్డి సంఘం భవన నిర్మాణానికి మండల రెడ్డి సంఘం అధ్యక్షుడు గుండాడి వెంకట్‌రెడ్డి బుధవారం శంకుస్థాపన చేశారు. మండల రెడ్డి సంఘ భవనానికి ఎంపీ పెద్ద ఎత్తున నిధులు కేటాయించడంపై ఆయా గ్రామాల రెడ్డి బాంధవులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు నిమ్మ లక్ష్మి, నేవూరి వెంకట్‌రెడ్డి, నరసింహరెడ్డి, ముత్యాల శ్రీనివాస్‌రెడ్డి, జంగ పద్మారెడ్డి, రెడ్డి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న సర్పంచ్ లాస్య

చందుర్తి/కోనరావుపేట: కోనరావుపేట మండలం ధర్మారం, చందుర్తి మండలం కొత్తపేట గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి సర్పంచులు గున్నాల అరుణ , పిట్టల లాస్య బుధవారం భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పెగ్గర్ల రమేశ్‌రావు, ఎంపీవో బండి ప్రదీప్‌కుమార్, పీఆర్ ఏఈ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, టీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు గంగమల్లయ్య, వార్డు సభ్యులు గంగ జల, వార్డు సభ్యులు బత్తుల రేఖ, తీగల వెంకన్న, వెలిశాల రవీందర్, రాజు, ఆసరి దేవ రాజ్ కార్యదర్శి అభిలాష్ పాల్గొన్నారు.

ట్రా'ఫికర్'

ముస్తాబాద్: మూడు జిల్లాల సరిహద్దులోని ముస్తాబాద్ పట్టణం విస్తరిస్తోంది. రోజు రోజుకు పెరుగుతున్న ట్రాఫిక్‌తో ప్రమాదాలు జరుగుతున్నాయి. పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా నిబంధనలను అతిక్రమిస్తూ ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతుండడం, రోడ్డుపైకి చొచ్చుకు వస్తున్న వ్యాపార సముదాయాలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే విమర్శ కూడా ఉంది. సిద్దిపేట, కామారెడ్డి, సిరిసిల్ల జిల్లాల సరిహద్దులో ఉన్న ఈ మండల కేంద్రం మీదుగా ఈ జిల్లాలకు చెందిన ప్రజలు నిరంతరం రాకపోకలు సాగిస్తుంటారు.

- రోడ్లపై వ్యాపారాలు
- ప్రమాదాల బారిన ప్రయాణికులు
- కూడళ్లలో ఇష్టానుసారంగా ప్రయాణం
- పెరుగుతున్న ప్రమాదాలు



ముస్తాబాద్‌లో తెలంగాణ చౌక్‌లో ట్రాఫిక్

ముస్తాబాద్ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా రాజీవ్ చౌక్‌లో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. ఇక్కడే ప్రధాన రహదారిపై తోపుడు బండ్లు, రహదారిని ఆక్రమించి మరి వస్తువులను పెట్టి విక్రయిస్తున్నారు. రాజీవ్ చౌక్ నుంచి పోతుగల్‌కు వెళ్లే రహదారిలోనే కూరగాయల మార్కెట్ ఉంది. ఇక్కడ ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ రద్దీ విపరీతంగా ఉంటుంది. సిద్దిపేట నుంచి, కామారెడ్డి వైపు నుంచి వచ్చే వాహనాలు నిబంధనలు పాటించకుండా ఎవరికి వారు వస్తుంటారు. అలాగే తెలంగాణ చౌక్‌లో పరిస్థితులు మరీ దారుణంగా వున్నాయి. కామారెడ్డి నుంచి దుబ్బాక వెళ్లే దారిలో ప్రమాదకరంగా మారింది. ఇక్కడ తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కొత్త బస్టాండ్ నుంచి రైతువేదిక వరకు ప్రధాన రహదారి ఇరువైపుల అక్రమణలకు గురైంది. రోడ్లపైనే వ్యాపారాలు సాగుతున్నాయి. ద్విచక్ర వాహనాలు, కార్ల పార్కింగ్ సమస్యగా మారింది. కొంతమంది వ్యాపారులు సగం దుకాణం సామాను రోడ్డుపైనే పెడుతున్నారు. కొన్ని ఎలక్ట్రికల్ దుకాణాలైతే రోడ్ల పైనే పైపులు, డ్రమ్ములు ఉంచుతున్నారు. మోటారు రిపేరు దుకాణాల పాత వాహనాలు రోడ్డుపైనే పెడుతున్నారు.

సంత రోజు తంటే..

ముస్తాబాద్‌లో ప్రతి ఆదివారం నిర్వహించే వారసంత పెద్ద ప్రహసనంగా మారింది. తెలంగాణ చౌక్ నుంచి కొత్త బస్టాండ్ వరకు ఒకవైపు రహదారిపై వారసంతను నిర్వహిస్తున్నారు. దీంతో కామారెడ్డి, సిద్దిపేట ప్రధాన రహదారిపై ఒకే లైను రహదారిని ఉపయోగంలోకి తీసుకువస్తున్నారు. ఫలితంగా సాయంత్రం నుంచి రాత్రి పది గంటల వరకు సింగిల్ దారిపై ప్రయాణించే వాహనాలు తరచూ ఢీ కొట్టుకుంటున్నాయి. ఇప్పటికే యాభై మందికిపై గాయాలపాలయ్యారు. ప్రతి ఆదివారం ఇక్కడ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆదివారం వారసంత రోజు జనం, వాహనాలతో కిక్కిరిసి పోతుంది. పోలీస్ యంత్రాంగం కూడా ఏమీ చేయలేక పోతోంది. ఇక్కడి నుంచి వారసంతను మరో చోటికి మారిస్తేనే సమస్య పరిష్కారమవుతుంది.

నిబంధనలు బేఖాతరు

ముస్తాబాద్‌లో వాహనదారులు నిబంధనలు పాటించడం లేదని అంటున్నారు. చౌరస్తాలలో, వన్ వేలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అన్నట్లుగా మారింది. కూడళ్లలో వాహనాలు నడిపే వారు ఎడమవైపు భాగం నుంచి వెళ్లాలనే స్పృహ కొంతమందిలో రావడం లేదు. ఎదురెదురుగా వెళ్తూ ఢీ కొట్టుకుంటున్నారు. చాకలి ఐలమ్మ, రాజీవ్ చౌక్, తెలంగాణ చౌక్, సుభాష్ చౌరస్తాలలో ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా పోలీస్ అధికారులు చర్యలు తీసుకోవాలి.

ప్రమాదాలు పెరిగాయి



ముస్తాబాద్‌లో ప్రధాన కూడళ్లలో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ట్రాఫిక్ నిబంధనలు ఎవరు పాటించడం లేదు. రహదారిని విస్తరించిన రోడ్లపైకి కొంతమంది వచ్చి వ్యాపారాలు చేస్తున్నారు. పోలీస్ అధికారులు ట్రాఫిక్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలి.

– యెల్ల బాల్‌రెడ్డి, ముస్తాబాద్

ట్రాఫిక్ నిబంధనలు గాలికి



ముస్తాబాద్‌లో వారసంత రోజు, ప్రధాన చౌరస్తాలలో జరిగిన ప్రమాదాల్లో పదుల సంఖ్యలో క్షతగాత్రులు అవుతున్నారు. పోలీస్ సిబ్బంది బందోబస్తు ఉన్నప్పటికీ, ఇష్టానుసారంగా వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడుతున్నారు. ట్రాఫిక్ నిబంధనలు అందరూ పాటించేలా చూడాలి.

– ఎదునూరి గోపి, ముస్తాబాద్

రోడ్లు ఆక్రమిస్తే చర్యలు



ముస్తాబాద్‌లో పెరుగున్న జనాభాకు తోడు వాహనాలు పెరిగాయి. కూడళ్లు చిన్నగా అయిపోయాయి. కొంతమంది రోడ్డు ఆక్రమించి వ్యాపారాలు చేస్తున్నారు. ఇలాంటి వారిని గతంలోనే హెచ్చరించాం. ఇకముందు అలాగే ఉంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. అందరూ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు అరికట్టవచ్చు.

– వెంకటేశ్వర్లు, ఎస్సై, ముస్తాబాద్

నేడు మొబైల్ ఠాణా దివస్

వేములవాడరూరల్: మండలంలోని వట్టెంల గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం మొబైల్ ఠాణా దివస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు వేములవాడ రూరల్ ఎస్సై నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోలీసులు నేరుగా ప్రజల వద్దకు వచ్చి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించే దిశగా ముందుకెళ్లడం జరుగుతుందన్నారు. కార్యక్రమం ద్వారా ప్రజల సమస్యలను స్వీకరించేందుకు గ్రామపంచాయతీ కార్యాలయంలో ఉదయం 8 గంటలకు వేములవాడ రూరల్ సీఐ బన్సీలాల్ అందుబాటులో ఉంటారన్నారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా చెప్పుకోవాలన్నారు.

'ప్రజలను ఏం ఉద్ధరించారని దశాబ్ది ఉత్సవాలు'



మాట్లాడుతున్న గడ్డం నాగరాజు

ఇల్లంతకుంట: సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో ప్రజలను ఏం ఉద్ధరించారని తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం నాగరాజు అన్నారు. మండలంలోని కందికట్కూర్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దళితులకు మూడెకరాల భూమి, ఇళ్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు, నిరుద్యోగులకు భృతి, రైతులకు ఇస్తామన్న పంట నష్టపరిహారం, రైతు రుణమాఫీ వంటి హామీలను ఇప్పటి వరకు నెరవేర్చనందుకు ఉత్సవాలు నిర్వహిస్తున్నారా అంటూ ప్రశ్నించారు. సీఎం కేసీఆర్ ప్రజలను గారడి మాటలతో మభ్యపెడుతున్నారని, ఎన్ని మోసపూరిత మాటలు చెప్పిన ఈసారి తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్‌కు కర్రుకాల్చి వాత పెట్టడం ఖాయమన్నారు. మానకొండూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అభివృద్ధి చెందుతున్నారే తప్ప, నియోజకవర్గంలోని గ్రామాలు అభివృద్ధి చెందడం లేదని విమర్శించారు. మండలంలోని గాలిపల్లిలో రేణుకా ఎల్లమ్మను ఆయన దర్శించుకున్నారు. బీజేపీ మండల అధ్యక్షుడు సంతోష్ పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

- చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

బోయినపల్లి: రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. బుధవారం బోయినపల్లి క్లస్టర్ రైతువేదిక భవనాన్ని రాష్ట్ర నాయకులు జోగినిపల్లి రవీందర్‌రావుతో కలిసి ప్రారంభించారు. అంతకుముందు బోయినపల్లి నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి, డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

డ్రోన్ సేద్యంతో కూలీల కొరతకు చెక్

మండల కేంద్రంలో నల్లగొండ వేణు అనే రైతు డ్రోన్ పరికరం డెమోలో ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రోన్ సేద్యంతో కూలీల కొరతకు చెక్ పెట్టవచ్చన్నారు. డ్రోన్ పరికరం ఆధారంగా రైతుల చేలలో చీడపీడల నివారణకు పురుగుల మందులు చల్లడం సులభమవుతుందన్నారు. సర్పంచ్ లతశ్రీ, ఏఈవోలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ,



రైతువేదిక భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ముదుగంటి సురేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు జోగినిపల్లి రవీందర్‌రావు, సర్పంచ్ లతశ్రీ, ఎంపీటీసీ బుచ్చమ్మ, డీఏవో భాస్కర్, ఎంఏవో ప్రణీత, సెస్ డైరెక్టర్ కొట్టెపెల్లి సుధాకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

బీరప్ప కల్యాణ ఉత్సవాల్లో ఎమ్మెల్యే

మండలంలోని కొదురుపాక ఆర్అండ్ఆర్ కాలనీలో నిర్వహిస్తున్న బీరప్ప కమరాతి కల్యాణ ఉత్సవాలకు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, రాష్ట్ర నాయకులు జోగినిపల్లి రవీందర్‌రావు, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు ఏటీ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు.

అక్షరాభ్యాసం



వీర్నపల్లి: సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు



ఎల్లారెడ్డిపేట: అక్షరాభ్యాసం చేయిస్తున్న నాయకులు

చందుర్తి/వీర్నపల్లి/ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా చందుర్తి, వీర్నపల్లి అంబేడ్కర్‌నగర్, ముస్తాబాద్ మండలంలోని రామలక్ష్మణపల్లె, ఎల్లారెడ్డిపేట మండలంలోని అల్మాస్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో ఒకటో తరగతిలో చేరిన బాల, బాలికలతో సామూహిక అక్షరాభాస్యం బుధవారం నిర్వహించారు. హెచ్ఎంలు తిరుపతి, వకుళ, ఫాతిమా, లక్ష్మణ్, వీర్నపల్లి సెస్ డైరెక్టర్ మాడుగుల మల్లేశం, ఎంపీటీసీ అరుణ్‌కుమార్, ఉపసర్పంచ్ బోయిని రవి, జంజార సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేశ్‌నాయక్, ఎస్ఎంసీ చైర్మన్ జోసెఫ్, ఎస్ఎంసీ చైర్మన్ మహిపాల్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్ వినయకుమారి, సర్పంచ్ రవీందర్‌రెడ్డి, రాధారపు పుష్పల, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు జ్ఞాపికలు

బోయినపల్లి: మండలంలోని విలాసాగర్ హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ జీపీఏ సాధించిన విద్యార్థులను బుధవారం చంద్రయ్య సార్ విద్యా వైద్య వికాస సమితి అధ్యక్షుడు చెన్నమాధవుని రామరాజు ఆధ్వర్యంలో జ్ఞాపికలు అందించి సత్కరించారు. హెచ్ఎం పర్శరాములు ఉన్నారు.

కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకే డబుల్ బెడ్రూం ఇళ్లు



నిలిచిపోయిన ఇళ్లను పరిశీలిస్తున్న నాయకులు

తంగళ్లపల్లి: కాంట్రాక్టర్ల జేబులు నింపేందుకే డబుల్ బెడ్రూం ఇళ్ల పథకం పనిచేస్తోందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జాలగం ప్రవీణ్ (టోని) ఆరోపించారు. మండలంలోని బద్దెనపల్లిలో నిర్మాణం నిలిచిపోయిన డబుల్ బెడ్రూం ఇళ్లను బుధవారం పరిశీలించి మాట్లాడారు. రైతులకు రుణమాఫీ చేయకుండా, 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయకుండా, డబుల్ బెడ్రూం ఇళ్లను పంచకుండా ఉత్సవాలు చేస్తున్నారని విమర్శించారు. ప్రజాసమస్యలపై కాంగ్రెస్ పోరాడుతుందని, రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, రైతు నాయకుడు పొన్నాల పరుశురాం, జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకుడు మునిగె రాజు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు

కోనరావుపేట: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు అన్నారు. మండలంలోని బావుసాయిపేటలో రూ.40 లక్షలతో నిర్మించే డ్రైయినేజీ పనులను బుధవారం ప్రారంభించి మాట్లాడారు. సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. మరికొద్ది రోజుల్లోనే మల్కపేట ప్రాజెక్ట్ ప్రారంభోత్సవాన్ని నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అలాగే మండలంలోని వెంకట్రావుపేటలో నిర్వహించిన పోచమ్మ బోనాల పండుగలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రయ్య, సర్పంచులు కెంద గంగాధర్, మంతెన సంతోష్, సెస్ వైస్‌చైర్మన్ తిరుపతి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు దేవయ్య పాల్గొన్నారు.



బోనాల పండుగలో పాల్గొన్న ఎమ్మెల్యే

పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

ఎల్లారెడ్డిపేట: పాఠశాలల్లో నెలకొన్న సమస్యలు ఎరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కల్యాణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే ఉత్సాహంగా పాఠశాలలు, కళాశాలలకు వెళ్తున్న విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయన్నారు. కనీసం పాఠశాలలు, కళాశాలలను శుభ్రం చేయకపోవడంతోపాటు కనీస వసతులు కల్పించడం లేదన్నారు. అధికారులు కార్యాలయాలకే పరిమితం కాకుండా విద్యాలయాల్లో నెలకొన్న సమస్యలను పరిశీలించాలన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే జిల్లావ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు ప్రదీప్, అనిల్, రవి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సెక్రటరీకి బెదిరింపులు

తంగళ్లపల్లి: మండలంలోని ఓ గ్రామ పంచాయతీ మహిళా సెక్రటరీపై అధికార పార్టీ నాయకుడు బెదిరింపులకు దిగాడు. గోపాల్‌రావుపల్లె గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇటీవల సిరిసిల్ల పట్టణంలో భవన నిర్మాణ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు తీవ్ర గాయాలపాలయ్యాడు. చికిత్స నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కరీంనగర్‌లో సదరు వ్యక్తికి సంబంధించిన మరణ ధ్రువీకరణ పత్రం తీసుకోవాల్సి ఉంది. కానీ గోపాలరావుపల్లెలోనే ధ్రువీకరణ పత్రం ఇవ్వాలని అదే గ్రామానికి చెందిన అధికార పార్టీ, కుల సంఘం నాయకుడు పట్టుబట్టాడు. నిబంధనల మేరకు డెత్ సర్టిఫికెట్ ఇవ్వలేమని పంచాయితీ సెక్రటరీ బదులివ్వడంతో ఆఫ్ట్రాల్ సెక్రటరీవి అంటూ ఫోన్‌లో బెదిరించసాగాడు. ఈ విషయం జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినట్లు తెలుస్తోంది. కాగా సదరు అధికార పార్టీ నాయకుడి తీరుపై విమర్శలు వినిపిస్తున్నాయి.

విద్యార్థులు కోర్సుపై స్పష్టతకు రావాలి

- కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల్

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం శ్రీ రాజరాజేశ్వరస్వామి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు రెండో రోజు పాలిక్వెస్ట్‌లో భాగంగా బుధవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రాజగోపాల్ అవగాహన సదస్సు ఆయన మాట్లాడారు. వెబ్ కౌన్సెలింగ్ కొరకు వినియోగించే ఫోన్ నెంబర్ సీటు కేటాయించే వరకు ఉండాలి. పాస్‌వర్డ్‌లు, ఓటీపీలు ఎవరికి చెప్పొద్దన్నారు. పాలిసెట్ వెబ్‌సైట్‌ను సందర్శిస్తే గతేడాది కటాఫ్ వివరాలు లభిస్తాయన్నారు. కేటగిరి కోర్సు అధారంగా విద్యార్థులు అంచనా వేసుకోని వెబ్ ఆప్షన్లను నమోదు చేసుకోవాలన్నారు. విద్యార్థులు ముందుగా ఏ కోర్సు అంటే ఇష్టం, స్థానికంగా చదువుతారా, దూరప్రాంతమైన పర్వాలేదా, అనే విషయంపై స్పష్టత ఉండాలన్నారు. అప్పుడే వెబ్ ఆప్షన్లకు ముందుకువెళ్లడం మంచిదన్నారు. ఒక జాబితాను కాగితంపై రాసుకుని ఆ తర్వాత వెబ్ ఆప్షన్లు ఇవ్వడం ప్రారంభిస్తే స్పష్టత వస్తుందన్నారు. ఎలాంటి గందరగోళం లేకుండా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ రాజగోపాల్

కుటుంబ కలహాలతో వృద్ధుడి ఆత్మహత్య

ఎల్లారెడ్డిపేట: మండలంలోని హరిదాస్‌నగర్‌కు చెందిన వృద్ధుడు గోపన్నగారి లక్ష్మయ్య(57) బుధవారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొంతకాలంగా కుటుంబంలో విభేదాలతో ఇబ్బందిపడుతున్న లక్ష్మయ్య, అనారోగ్యంతో బాధపడుతున్నాడు. పలు ఆసుపత్రులు తిరిగినా రోగం నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది గ్రామ శివారులోని మానేరు వాగు వంతెన కింద ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులకు గాలించగా వంతెన కింద ఉరివేసుకొని కనిపించాడు. కుటుంబ సభ్యులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడికి భార్య బాలవ్వ, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఒకరికి యావజ్జీవం

సిరిసిల్లక్రైం: మహిళను హత్య చేసిన కేసులో నేరస్తుడికి యావజ్జీవం కారాగార శిక్ష విధిస్తూ సిద్దిపేట ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ న్యాయమూర్తి బుధవారం తీర్పునిచ్చారు. వేములవాడ పట్టణం శాస్త్రీనగర్‌కు చెందిన కైరి వెంకటేశ్ అలియాస్ వెంకీ ఎల్లారెడ్డిపేటకు చెందిన న్యాలకంటి దివ్యతో పెళ్లి విషయంలో గొడవపడి గజ్వేల్‌లో ఆమె కిరాయికి ఉంటున్న ఇంటికి వెళ్లి కత్తితో పొడిచి హత్య చేశాడు. కేసు నమోదు చేసిన గజ్వేల్ పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు ప్రవేశపెట్టిన సాక్ష్యాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరస్తుడు వెంకటేశ్‌కు జీవితఖైదుతోపాటు రూ.వెయ్యి జరిమానా విధించారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన కారు

ముస్తాబాద్: మండలంలోని పోతుగల్‌కు చెందిన బాదవేని రాజు ఇంట్లోకి ఉన్నట్టుండి బుధవారం రాత్రి గోడలు బద్దలు కొడుతూ ఓ కారు దూసుకొచ్చింది. అందరు ఇంట్లోనే ఉన్న సమయంలో జరిగిన ఈ హఠాత్తు పరిణామానికి రాజు కుటుంబీకులు ఆందోళనకు గురయ్యారు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కారులో ఉన్న వారికి కూడా ఎలాంటి గాయాలు కాలేదు.

ఇంటిగ్రేటెడ్ డే కేర్ సెంటర్ ఏర్పాటు చేయండి

సిరిసిల్లకల్చరల్: వయో వృద్ధుల కోసం ఇంటిగ్రేటెడ్ డే కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ఆల్ సీనియర్ సిటీజన్ అసోసియేషన్ ప్రతినిధులు చేపూరి బుచ్చయ్య, డాక్టర్ జనపాల శంకరయ్య, దొంత దేవదాస్, రాష్ట్ర ఐటీ మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రాన్ని అందించారు.

వ్యాసకర్త చిటికెనకు సత్కారం

సిరిసిల్లకల్చరల్: పట్టణానికి చెందిన ఉదీయమాన వ్యాసకర్త చిటికెన కిరణ్‌కుమార్‌ను హైదరాబాద్ జేకే ఫౌండేషన్ సత్కరించింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సాహిత్య రంగంలో కిరణ్ కృషిని ప్రశంసిస్తూ సత్కరిస్తున్నట్లు సంస్థ చైర్మన్ అమృత్ కుమార్‌జైన్ ప్రకటించారు. ఈ సందర్భంగా కిరణ్‌ను జిల్లాలోని పలువురు కవులు అభినందించారు.

నైపుణ్యతతో ఆర్థికాభివృద్ధి



మహిళలకు పంపిణీ చేసిన కుట్టుమిషన్లు

- ప్రతిమ ఫౌండేషన్ బాధ్యుడు చెన్నమనేని వికాస్
- మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

కోనరావుపేట: నైపుణ్యతతో ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని ప్రతిమ ఫౌండేషన్ బాధ్యుడు డాక్టర్ చెన్నమనేని వికాస్‌రావు పేర్కొన్నారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన 300 మహిళలకు బుధవారం కుట్టు మిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నాగారంలో శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేశారన్నారు. పరిశ్రమలు వస్తేనే స్థానికులకు ఉపాధి లభిస్తుందన్నారు. రుణాలు ఇచ్చేందుకు రైతులను ఇబ్బందులు పెడుతున్న బ్యాంకులు బడాబాబులకు మాత్రం రూ. వందల కోట్లు ఇస్తున్నారని, వారు రుణాలు చెల్లించలేక విదేశాలకు పారిపోతున్నారన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి బాధ్యులు డాక్టర్ దీప, మాజీ జెడ్పీటీసీ అన్నపూర్ణ, సింగిల్‌విండో డైరెక్టర్ మహేశ్వరి, సర్పంచులు అరుణ, ప్రమీల, బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్ రావు, ఎంపీటీసీలు ప్రవీణ్‌కుమార్, రేణుక, ఉప సర్పంచ్ శంకర్, నాయకులు గొట్టె రామచంద్రం, బాలాజీ, భాస్కర్, శ్రీనివాస్ రెడ్డి, లచ్చిరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.